క్లుప్తంగా

విత్తన ఎంపికలో మెలకువలు పాటించాలి


మాట్లాడుతున్న ఏఓ విజయలక్ష్మి

చిప్పగిరి: విత్తనాల ఎంపికలో రైతులు మెలకువలు పాటించాలని ఏఓ విజయలక్ష్మి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న దుకాణాలలో మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. కొన్న తరువాత రసీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. వ్యవసాయ సంబంధిత సలహాలు, సమాచారం కోసం స్థానిక ఆర్బీకేలను సంప్రదించాలని రైతులకు సూచించారు.

ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం పూర్తిచేయాలి

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపణ్ణగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరందించే ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సీపీఐ నాయకులు చిన్నన్న, తిమ్మగురుడు, సమీవుల్లా, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ


విద్యార్థులతో హెచ్‌ఎం, పూర్వ విద్యార్థులు

మద్దికెర: స్థానిక జెడ్పీ పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు ప్లేట్లు, గ్లాసులను విరాళంగా ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రప్పకు సోమవారం అందజేశారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించడమే గాకుండా సహాయ సహకారాలు అందించడం హర్షించదగ్గ విషయమని హెచ్‌ఎం అన్నారు. అనంతరం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు శ్రీకాంత్‌లాల్, మల్లికార్జున, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి


పనులు పరిశీలిస్తున్న డీఈ, జెడ్పీటీసీ

మద్దికెర: సచివాలయం, ఆర్బీకేల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పీఆర్ డీఈ శేషయ్య, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మద్దికెర, హంప గ్రామాలలో నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేస్తోందన్నారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని కాంట్రాక్టర్లు అధికారుల సమక్షంలో పనులు చేయాలని సూచించారు. నిర్మాణ పనులను నిలిచిపోయిన ఆర్బీకేలను ఇతరులకు ఇవ్వడం జరిగిందని వాటిని సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఈ మోహన్‌నాయక్, సచివాలయ కన్వీనర్ తాలురి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మంజునాథ్‌రెడ్డి, భీమలింగప్ప ఉన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

చిప్పగిరి: గ్రామాలలో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు త్వవని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో.. గతంలో వివిధ మద్యం కేసుల్లో నిందితులుగా ఉన్న పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు జరకుండా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అల్లర్లకు పాల్పడకుండా మొహర్రం పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

చిరస్మరణీయుడు అయ్యంకి

పత్తికొండటౌన్: గ్రంథాలయాలకు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య చేసిన సేవలు ఎనలేనివని గ్రంథాలయాధికారి ఎస్.రాంకుమార్ అన్నారు. గ్రంథాలయ ఉద్యమ సారథి అయ్యంకి వెంకట రమణయ్య 133వ జయంతిని సోమవారం పత్తికొండ శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం కాశీం సాహెబ్, రిటైర్డు ఉద్యోగులు వీరప్రతాప్, దేవి నారాయణ, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా సమస్యల పరిష్కారం
- పవన్‌కళ్యాణ్ గాలి మాటలను ప్రజలు నమ్మరు
- వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం
- మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే
- మంత్రి గుమ్మనూరు జయరాం


జిల్లెడబుడకలలో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

దేవనకొండ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని జిల్లెడబుడకల, మాదాపురం గ్రామాల్లో ఎంపీడీఓ గౌరీదేవి, సర్పంచ్ హనుమంతు ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో, పూల మాలలతో స్వాగతం పలికారు. మంత్రి ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లెడబుడకలలో చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మాదాపురం గ్రామంలో ఈశ్వర ఆలయ అభివృద్ధికి సాయం అందిస్తానన్నారు. మాదాపురం అడ్డు రోడ్డు నుంచి శివాలయం వరకు, సుంకులమ్మ దేవాలయం నుంచి సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లెడబుడకల పంచాయతీ అభివృద్ధికి అప్పటివరకు రూ.8.02 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. గ్రామంలో విద్యుత్ సమస్య వెంటనే పరిష్కరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గాలి మాటలను ప్రజలు నమ్మరని, ఏపీలో అమలవుతున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబునాయుడు డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వారికి మరోసారి గుణపాఠం తప్పదన్నారు. సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో సీఎం వైఎస్ జగన్ సుస్థిరస్థానం పొందారని, రాష్ట్రంలో మళ్లీ జగనన్న ప్రభుత్వమే వస్తుందన్నారు. నాలుగేళ్ల పాలనలో మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలని కోరారు. మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామి, డీఏస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ భూపాలుడు, ఏఓ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, జెడ్పీటీసీ రామకృష్ణ, దివాకర్‌నాయుడు, లుముంబా, తువ్వదొడ్డి మోహన్‌రెడ్డి, నిజాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలూరులో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

ఆలూరు: ఆలూరులో మంగళవారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి గుమ్మనూరు జయరాం పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు శేఖర్, ఎంపీపీ రంగమ్మ సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఆలూరులో నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. మండలంలోని నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


ఆలూరు సీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుబ్బారాయుడు

ఆలూరు రూరల్: ఆలూరు సీహెచ్‌సీలో ప్రతి సోమవారం నిర్వహించే సదరం క్యాంప్ దివ్యాంగులకు వరం అని ఆర్థోపెడిక్ డాక్టర్ సుబ్బారాయుడు అన్నారు. సోమవారం ఆయన స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సదరం క్యాంపులో 15 మంది దివ్యాంగులకు వైకల్య పరీక్షలు చేశారు. ఆయన మాటాడుతూ.. దీర్ఘకాలిక అంగవైకల్యం, ప్రమాదాల బారినపడి వైకల్యం పొందిన పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ కేంద్ర ఆస్పత్రిలో ప్రతి సోమవారం సదరం క్యాంపులు నిర్వహిస్తోందన్నారు. అంగవైకల్యం పొందిన వారు వారి గ్రామ సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకుని ఇచ్చిన తేదీ ప్రకారం ఆస్పత్రికి వచ్చి సర్టిఫికెట్ కోసం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నేడు మద్దికెరకు ఎమ్మెల్యే రాక

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధరరెడ్డి సోమవారం తెలిపారు. సచివాలయం–3లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు 11 రకాల ధ్రువ పత్రాల ను ఉచితంగా అందజేస్తారన్నారు. ప్రజాప్రతినిధు లు, అధికారులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

పాఠశాలపై విచారణకు ఆదేశం

గోనెగండ్ల: విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా గోనెగండ్లలో జీనియస్ గ్లోబల్ స్కూల్ ఏర్పాటు చేయడంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పెట్రోల్ బంకుల సమీపంలో పాఠశాల రేకులషెడ్డులో కొనసాగుతోంది. ఆటస్థలం, క్రీడా పరికరాలు, వసతులు లేకపోవడంతో ఆ పాఠశాలపై విద్యార్థి సంఘాల నాయకులు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు ఎంఈఓ రామాంజినేయులు సోమవారం తెలిపారు. పాఠశాలలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని డీఈఓ ఆదేశించినట్లు చెప్పారు.

ఇళ్లు కూల్చేస్తామంటే ఎలా..?


ఈఓ శ్రీహరితో మొరపెట్టుకుంటున్న కాలనీవాసులు

మద్దికెర: 20 ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకుని జీవనం చేస్తున్నామని ఇప్పుడు కూల్చేస్తామంటే ఎలా? అని కాలనీవాసులు సునీత, హనుమంతమ్మ, లక్ష్మిదేవి తదితరులు ఈఓ శ్రీహరికి విన్నివించారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓను కలిశారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ.. లాయర్ లింగారెడ్డి అనే వ్యక్తి స్థానిక బస్టాండు వద్ద రెండు ట్యాంకుల సమీపంలో శ్మశానం వద్ద పంచాయతీ స్థలాల్లో అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించుకున్నారని వాటిని కూల్చేయాలని జిల్లా కలెక్టరుకు రిపోర్టు చేశారన్నారు. ఇళ్లను కూల్చేయాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని, అందుకు సంబంధించి ఇంటి యజమానులకు నోటీసులు అందజేయడం జరిగిందన్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కూలీ పనులు చేసుకుంటూ ఇళ్లను నిర్మించుకున్నామని, ఇప్పుడు కూల్చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. అధికారులు స్పందించి నోటీసులు నిలుపుదల చేయాలని కోరారు.

టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలి

నందవరం: ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం నందవరంలో ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. కరువు కాటకాలకు నిలయంగా ఉన్న మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలను అభివృద్ధి చేయాలని, 4 టీఎంసీల సామర్థ్యంతో రాజోలి బండ కుడి కాలువ నిర్మాణం పూర్తిచేయాలన్నారు. అలాగే మంత్రాలయం నుంచి కర్నూలుకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి విజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలు కార్డులు


కౌలు కార్డులను పరిశీలిస్తున్న ఏఓ మత్రి స్రవంతి

నందవరం: భూ యాజమాని వద్ద పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న వారందరికీ కౌలు కార్డులు (సీసీఆర్‌సీ) అందిస్తామని ఏఓ మత్రి స్రవంతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సీసీఆర్సీ కార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలానికి 655 టార్గెట్ ఇవ్వగా ప్రస్తుతం 500 మందికి కౌలు కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. అర్హులు మిగిలి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వివరించారు. ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఏఈఓ సురేంద్రగౌడ్, వీఏఏలు త్రివేణి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి షష్టి పూజలు

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామివారికి సోమవారం షష్టి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దేవసేన, శ్రీవల్లి సమేతుడై కొలువుదీరగా అర్చకులు హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు విజయ్ పాల్గొన్నారు.

అందుబాటులోకి షాపింగ్ కాంప్లెక్స్


ఆలూరులో హైవే–167 పక్కన నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

ఆలూరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయ షాపింగ్ కాంప్లెక్స్ నేటి నుంచి అందుబాటులోకి రానుంది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మంగళవారం కాంప్లెక్స్‌ను ప్రారంభించనున్నారు. రూ.80 లక్షల రూర్బన్ నిధులు వెచ్చించి హైవే–167 పక్కన 18 గదులతో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు. అనివార్య కారణాల వల్ల ప్రారంభానికి నోచుకోలేదు. షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్స్‌తో పాటు పన్నేతర ఆదాయం లభిస్తుంది. షాపుల అద్దె ద్వారా మండలంలో పలు అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించనున్నారు. వ్యాపారులకు సైతం ఈ కాంప్లెక్స్ ద్వారా ఉపాధి దొరకనుంది. అత్యంత విలువైన ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లకు మంచి డిమాండ్ ఉంది. వేలం ప్రక్రియ ద్వారా వ్యాపారస్తులకు దుకాణాలు కేటాయించనున్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు వీటి అద్దె నిర్ణయిస్తామని ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు.

నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

వెల్దుర్తి: విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25వ తేదీ మంగళవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ మండల ప్రతినిధులు అడవిరాముడు, మనోహర్, సుమంత్, సుధీర్ ఉన్నారు.

వీధి బాలలను బడిలో చేర్చండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ కవిత

పత్తికొండటౌన్: బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎం.కవిత సూచించారు. సోమవారం పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల, యశోదా గార్డెన్ ఉన్నత పాఠశాలలను ఎంపీడీఓ కవిత, ఎంఈఓ–1 ఉల్లిగడ్డల మస్తాన్‌వలి, ఎంఈఓ–2 గాజుల రమేష్, ఈఓఆర్డీ శ్రీకాంత్ చౌదరి ఆధ్వర్యంలోని అధికారుల బృందం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5–18 ఏళ్లలోపు పిల్లలు చదువుకు దూరం కారాదన్నారు. అలాంటివారు ఉంటే గుర్తించి వారు పాఠశాలల్లో చేరేలా చూడాలన్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల పేర్లు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

స్పందన అర్జీలు పరిష్కరించండి

కృష్ణగిరి: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాజేశ్వరి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన పలు అర్జీలను ఆమె స్వీకరించారు. వచ్చిన అర్జీలను శాఖల వారీగా అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పట్ల వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు మూడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో బీఆర్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాలో సవరణలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ విశ్వమోహన్, ఏఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన

చిప్పగిరి: మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యానికి పాల్పడడంతో పాటు సమాజం సిగ్గుపడేలా వ్యవహరించిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మహేంద్రనాయుడు, లిబరేషన్ పార్టీ తాలూకా కార్యదర్శి మునిస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థత వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. నాయకులు బాష, నారాయణ, చిరు, సంజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన దుర్మార్గులకు ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రస్తారోకో చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఆ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి


హాలహర్విలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో పర్యటించారు. పీస్ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా నిర్వహించుకునే మొహర్రం పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. అల్లరిమూకలు గ్రామంలో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువాలన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అందురూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఐకమత్యంగా జీవించాలని సూచించారు. ముందుగా డీఎస్పీ సీతారామయ్య, సీఐ మోహన్ రెడ్డి, ఎస్‌ఐ తిమ్మయ్యను గ్రామ సర్పంచ్ మునెమ్మ, మాజీ సర్పంచ్ రామకోటేశ్వరరెడ్డి శాలువా, పూల మాలలతో సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప, సావిత్రమ్మ, బజారి, రమేష్, శాంతిరాజు, జయరాజు, హజరత్‌బిలాల్, వెంకటేష్, రామకృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం రాత్రి ఆయన పెద్దగోనెహాళ్, ఎండీ హళ్లి, ఇంగళదహాళ్ గ్రామాలలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. పీర్ల నిమజ్జనంలో భాగంగా ఊరేగింపు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, సమస్యలు సృష్టించే వారిపై నిఘా ఉంచామని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మినారాయణ మండల ప్రజలకు సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినతులు పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామన్నారు. ఎంపీడీఓ కొండయ్య, డీటీ గుండాల నాయక్, ఏపీఎం నాగార్జున, ఏఓ విజయ లక్ష్మి, ఈఓపీఆర్డీ సంజన్న, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కృష్ణగిరి: పొలాలను కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్న రైతులు కౌలు కార్డులు (సీసీఆర్సీ) కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు 246 మంది రైతులు కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోగా వారందరికీ కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ఇంకా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని విచారణ చేపట్టి కార్డులు అందిస్తామన్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసే రైతులకు చిరుధాన్యాల విత్తనాలు అందిస్తామని పేర్కొన్నారు.

నేడు ఆటోడ్రైవర్లకు కంటి పరీక్షలు

పత్తికొండటౌన్: రవాణా శాఖ ఆధ్వర్యంలో పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు ఆటోడ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీపిక తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. ఆటో డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీధుల్లో బురద మట్టి తొలగింపు

హొళగుంద: ఇంగళదహాళ్ గ్రామంలోని పలు వీధుల్లో పేరుకుపోయిన బురదను సోమవారం సర్పంచ్ ప్రభావతమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి తొలగింపు పనులు చేపట్టారు. చాలాకాలంగా వీధుల్లో భారీగా మట్టి పేరుకుపోయింది. ఇటీవల వర్షం కురవడంతో వీధుల్లో ప్రజలు తిరిగేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో సోమవారం సర్పంచ్ ఆదేశాలతో వెంకట్రామిరెడ్డి కూలీలను పెట్టి బురద మట్టితో పాటు చెత్త చెదారాన్ని, మురుగునీటిని తొలగించారు. అలాగే మొహర్రం సందర్భంగా భక్తులు ఇబ్బందులు పడకుండా పీర్ల చావిడి వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

ముమ్మరంగా రహదారి పనులు

హాలహర్వి: మండలంలోని చింతకుంట–సిరిగాపురం గ్రామాల మధ్య రహదారిలో సోమవారం మట్టిని వేసి ప్రొక్లెయిన్‌తో చదును చేయించారు. మూడు కి.మీ మేర మట్టిని వేసి రహదారిని బాగు చేస్తున్నట్లు ఎంపీపీ నెట్టికంతమ్మ తెలిపారు. మొత్తం రూ.8 లక్షలతో రోడ్డు పనులు చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో ఎమ్మెల్యే కోటా కింద రూ.5 లక్షలు, ఎంపీపీ గ్రాంట్ కింద రూ.3 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. రహదారి మధ్యలో మోరీల వద్ద నాలుగు పైపులు వేస్తున్నట్లు తెలిపారు. రెండు గ్రామాలకు మట్టి రోడ్డు వేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీపీకి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పత్తికొండటౌన్: అన్ని అవయవాల్లో కళ్లు ప్రధానమైనవని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ సూచించారు. సోమవారం స్థానిక సాయి మందిరం ప్రాంగణంలో రామచంద్రారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూలు విశ్వభారతి ఆస్పత్రికి చెందిన కంటి వైద్య నిపుణులు సురేష్‌కుమార్, శ్రావణ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శిబిరానికి హాజరైన 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్స అవసరమైన 62 మందిని కర్నూలుకు తరలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కొమ్ము నెట్టేకల్లు, కృష్ణారెడ్డి, విశ్వనాథ్, వలంటీర్లు ఇస్మాయిల్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


కలుగొట్లలో బీజామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్, సిబ్బంది

వెల్దుర్తి: రైతులు ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన సాంకేతికతను అందించాలని ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. ఆయన సోమవారం ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్‌తో కలిసి మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో రైతు పరమేశ్ పొలంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించారు. రైతులు వ్యవసాయంలో సొంత నిర్ణయాలు తీసుకునేలా పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. విత్తు దశ నుంచి పంట కాలం పూర్తయ్యే వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి, ఆరోగ్యకర దిగుబడులు పొందడం ద్వారా లాభాలు ఆర్జించాలన్నారు. ఆ శాఖ మాస్టర్ ట్రైనర్స్ మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పరమేశ్వరుడు, చిట్టెమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి


గోనెగండ్ల జెడ్పీ హైస్కూల్ వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన బంకు

గోనెగండ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన బంకును తొలగించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేవీపీఎస్ నాయకులు, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు స్థానిక పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాల వద్ద వాటర్ ట్యాంకు ముందున్న స్థలంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. ఆ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన బంకును తొలగించాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి: పట్టణానికి చెందిన నలుగురు సారా విక్రేతలను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తాము జరిపిన దాడుల్లో పట్టణ సమీప ఎల్లమ్మ గుడి వద్ద రామానాయుడు, రామకృష్ణ, మద్దిలేటి, వెంకటేశ్వర్లు నుంచి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఆధునిక కవులకు మార్గదర్శి జాషువా


గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పత్తికొండటౌన్: ఆధునిక కవులకు మార్గదర్శి గుర్రం జాషువా అని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ అన్నారు. గుర్రం జాషువా 52వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం పత్తికొండ పట్టణంలో అరసం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూఢాచారాలను ప్రతిఘటిస్తూ గుర్రం జాషువా ఎన్నో రచనలు చేశాడని కొనియాడారు. సమానత్వం, సామాజిక ప్రయోజనం కాంక్షిస్తూ రచనలు చేశారని, నేటి కవులకు దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. ఉపాధ్యాయ సిబ్బంది విజయలక్ష్మి, నాగరాజు, విజయభారతి, హమీద్, ఈశ్వరి, శాంతి, మహబూబ్‌బీ, రహంతుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.